క్లుప్తంగా

రేపటి నుంచి శాకంబరీ దేవిగా అలంకరణ

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): ఆషాఢ మాసం సందర్భంగా స్థానిక పెజ్జోనిపేటలోని శ్రీ లక్ష్మీనారాయణస్వామి దేవస్థానంలో ఈ నెల 19నుంచి మూడు రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యదర్శి కృష్ణప్రసాద్ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శుక్ర, శనివారాల్లో అమ్మవారిని శాకంబరీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదివారం గురుపూర్ణిమ సందర్భంగా ఉదయం దత్త హోమం, అభిషేకం, అన్న సంతర్పణ, రాత్రి పల్లకి సేవ, పవళింపు సేవ వంటి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు ఈ పూజా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కరాటే విద్యార్థులకు బెల్టుల ప్రదానం



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని జేకే గోజురియో కరాటే అకాడమీ సత్యనారాయణపురం బ్రాంచ్‌కు చెందిన విద్యార్థులకు సంస్థ ప్రధాన కార్యాలయంలో బెల్ట్ ప్రమోషన్ పరీక్షలు నిర్వహించారు. ఇందులో ఎల్లో బెల్ట్ నుంచి దశలవారీగా బ్లాక్ బెల్ట్ వరకు ప్రమోట్ అయిన విద్యార్థులకు సత్యనారాయణపురం బ్రాంచ్ హెడ్ కోచ్ పీవీకెఎస్ హర్ష బుధవారం ఆయా బెల్ట్‌లతోపాటు సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల శారీరక దారుఢ్యం, ఆత్మరక్షణకు కరాటే విద్య దోహదపడుతుందన్నారు. కరాటేలో వివిధ రకాల బెల్టులు పొందిన విద్యార్థులు మరింత శిక్షణ తీసుకుని వారి లక్ష్యాన్ని చేరుకోవాలని ఆకాంక్షించారు. పలు రకాల బెల్టులను అందుకున్న విద్యార్థులను అకాడమీ వ్యవస్థాపకుడు జె.శ్రీనివాసులు, టెక్నికల్ డైరెక్టర్ జె.హరినాథ్, ట్రెజరర్ సీహెచ్ మహేష్‌బాబు అభినందించారు.

విభిన్న ప్రతిభావంతులకు కళ్లజోళ్ల పంపిణీ



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మొహరం పండుగ సందర్భంగా విభిన్న ప్రతిభావంతులకు ఉచితంగా కళ్లజోళ్లు అందజేసినట్లు అబ్దుల్ కలాం విభిన్న ప్రతిభావంతుల అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ ఆయూబ్ ఖాన్ చెప్పారు. వన్‌టౌన్‌లోని రాయల్ ఆర్టికల్స్ ప్రాంగణంలో బుధవారం సాయంత్రం వంద మంది విభిన్న ప్రతిభావంతులకు ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయూబ్ ఖాన్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల సమస్యల పరిష్కారానికి తమ సంఘం తరఫున కృషి చేస్తున్నట్లు వివరించారు. ఎన్టీఆర్ జిల్లాలో దాదాపు 15 వేల మంది విభిన్న ప్రతిభావంతులు ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ నేత్ర వైద్యుడు డాక్టర్ రావెళ్ల రాజకుమార్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు, నిరుపేదలకు అబ్దుల్ కలాం అసోసియేషన్ తరఫున అందజేస్తున్న సేవలను ప్రశంసించారు. తమ వంతు సహకారం అందజేస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో షఫీ తదితరులు పాల్గొన్నారు.

21న వైతాళికుల చిత్రపటాల ఆవిష్కరణ



కృష్ణలంక(విజయవాడతూర్పు): తెలుగు రాష్ట్రాలలో సమాజాన్ని పురోగమనం వైపు నడిపించేందుకు కృషిచేసిన వైతాళికుల చిత్రపటాల ఆవిష్కరణ కార్యక్రమం ఈ నెల 21వ తేదీ ఉదయం 10 గంటలకు రాఘవయ్య పార్కు సమీపంలోని బాలోత్సవ భవన్‌లో జరుగుతుందని ఎం.బి.విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పి.మురళీకృష్ణ తెలిపారు. ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో వైతాళికుల చిత్రపటాల ఆవిష్కరణకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ తెలుగునాట 1650, 1700 సంవత్సరాల నాటి నుంచే అభ్యుదయ భావాలు పూరించిన పోతులూరి వీరబ్రహ్మం, ప్రజాకవి వేమన, కందుకూరి, గురజాడ, గిడుగు రామ్మూర్తి, గుడిపాటి వెంకటాచలం, కుసుమ ధర్మన్న, మగ్దూం మోహిద్దీన్, శ్రీశ్రీ , బండారు అచ్చమాంబ, దాశరథి కృష్ణమాచార్య లాంటి 32 మంది మహోన్నతుల చిత్రపటాలు ఆవిష్కరిస్తారన్నారు. రచయితలు, కవులు, కళాకారులు, కళాభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ప్రముఖ రచయిత్రి మందరపు హైమావతి, ప్రముఖ చిత్రకారులు అరసవిల్లి గిరిధర్, క్రాంతి కిరణ్, జాషువా సాంస్కృతిక వేదిక కార్యదర్శి గుండు నారాయణ, జేఎంఎస్ వ్యవస్థాపకుడు జె.చక్రవర్తి పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా తొలిఏకాదశి పర్వదిన వేడుకలు

- శ్రీకృష్ణ భగవానునికి ప్రత్యేక అభిషేకాలు
- వెంకన్న సన్నిధిలో కోటి తులసీదళార్చన

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వన్‌టౌన్‌లోని వైష్ణవాలయాల్లో బుధవారం పలు వైదిక కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ముఖ్యంగా ఆయా ఆలయాల్లో ఉన్న మూలమూర్తులకు, ఇతర దేవతామూర్తులకు పలు విశేష కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆయా మూలవిరాట్‌లకు అభిషేకాలను వేదోక్తంగా నిర్వహించారు.

వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో...

వన్‌టౌన్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో స్వామి వారికి కోటితులసీదళార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయంలోని కల్యాణవేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులను అధిష్ఠింపజేసి కోటితులసీదళార్చనను జరిపించారు. విష్ణు సహస్రనామాలతో పెద్ద సంఖ్యలో భక్తులు తులసీదళాలతో స్వామి వారికి పూజలు నిర్వహించారు. మంగళవాయిద్యాలు, భక్తుల నామార్చనలు, అర్చకుల వేద పఠనాల మధ్య స్వామి వారికి కోటితులసీదళార్చనను జరిపించారు. అంతరాలయంలో మూలమూర్తి ప్రత్యేకంగా పులంగి సేవ నిర్వహించి ప్రత్యేక అలంకారం చేశారు. సాయంత్రం స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిగాయి, వైదిక కార్యక్రమాలను ఆలయ అర్చకులు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి, పొన్నంగిపల్లి దీక్షిత్, పరాశరం బాలముకుందాచార్యులు నిర్వహించగా కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి మోహనరావు పర్యవేక్షించారు.



శ్రీ కృష్ణ భగవానునికి క్షీరాభిషేకం

కోదండరామునికి లక్ష తులసీదళార్చన

భావనారాయణవీధిలో కొలువై ఉన్న కోదండరామ స్వామి దేవస్థానంలో స్వామి వారికి తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం లక్ష తులసీదళార్చనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామి వారికి ప్రత్యేకంగా అభిషేకాలను జరిపారు. అనంతరం స్వామి వారికి విశేష అలంకారం చేశారు. స్వామి వారికి విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. అనంతరం స్వామి వారికి తులసీదళార్చన జరిపించారు. కార్యక్రమాలను ఆలయ అర్చకస్వాములు టీవీ రాఘవేంద్రదీక్షితులు నిర్వహించారు.

శ్రీకృష్ణ ప్రార్థనామందిరంలో...

శ్రీకృష్ణ ప్రార్థనా మందిరంలో ఉన్న శ్రీకృష్ణార్జునుల వారికి ప్రత్యేక వైదిక కార్యక్రమాలు జరిగాయి. ఉదయం అభిషేకాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి వార్ల మూర్తులకు తులసీదళార్చనను నిర్వహించారు. ఆలయంలో 18 అధ్యాయాల గీతా పారాయణ కార్యక్రమాన్ని జరిపించారు. పలువురు ప్రముఖులు స్వామి వారిని దర్శించుకొని వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గోకవరపు మురళీకృష్ణ, గుడిపాటి పాపారావు కార్యక్రమాలను నిర్వహించారు.



శ్రీవారి సన్నిధిలో స్వామి వారికి విశేష పూజలు



భావనారాయణ వీధిలోని కోదండరామునికి లక్ష తులసీదళార్చన

కొత్తగుళ్ళలో...

కొత్తగుళ్ల ప్రాంగణంలో ఉన్న శ్రీ కోదండ రామస్వామి వారి దేవస్థానంలో పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి మూలమూర్తులకు తిరుమంజనంను శాస్త్రోక్తంగా జరిపారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారికి పూజలు నిర్వహించారు. పులిపాక ఆంజనేయాచార్యులు, రాఘవాచార్యులు తదితరులు వైదిక కార్యక్రమాలను పర్యవేక్షించారు.



స్వామి వారికి తులసీ దళాలతో అర్చన

శ్రీనివాసునికి పంచామృత అభిషేకాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తొలి ఏకాదశిని పురస్కరించుకుని చిట్టినగర్‌లోని శ్రీపద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో బుధవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున స్వామి వారికి సుప్రభాత సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని భోగ శ్రీనివాసునికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చన, విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలోని మూలవిరాట్‌కు ఆలయ అర్చకులు వినుకొండ రామరత్నాచార్యులు, గోపాల్ తులసీ దళాలతో అర్చన నిర్వహించారు. స్వామి వారికి పెద్ద సంఖ్యలో భక్తులు తులసీ దళాలను సమర్పించి పూజలు జరిపించుకున్నారు. స్వామి వారిని దర్శించుకునేందుకు భారీగా భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణంలో దేవస్థాన కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

నగరంలో విరాజి చిత్ర బృందం సందడి



పటమట(విజయవాడతూర్పు): సినీ హీరో వరుణ్ సందేశ్ నటించిన విరాజి చిత్రబృందం బుధవారం నగరంలో సందడి చేసింది. తన 17 ఏళ్ల సినీ కెరియర్‌లో ఇప్పటివరకు చేయని ఒక వినూత్నమైన సినిమా విరాజి చిత్రమని ఈ చిత్రాన్ని ప్రేక్షకులు విజయవంతం చేయాలని హీరో వరుణ్ సందేశ్ కోరారు. చిత్ర ప్రమోషన్‌లో భాగంగా నగరంలోని ఓ హోటల్లో చిత్ర యూనిట్ విలేకరులతో మాట్లాడింది. ఈ సందర్భంగా వరుణ్ సందేశ్ మాట్లాడుతూ ఒక డిఫరెంట్ కథతో డిఫరెంట్ లుక్‌తో ఆగస్టు రెండున విరాజి చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు చెప్పారు. విజయవాడ నగరం నుంచి చిత్ర ప్రమోషన్ ప్రారంభించామని, ఇప్పటివరకు ఏ హీరో చేయని మాదిరిగా విరాజీ చిత్రంలో తాను నటించిన క్యారెక్టర్‌ను ప్రేక్షకులకు తెలియజేసేందుకు అదే గెటప్పుతో ప్రమోషన్ కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు చెప్పారు. ఈ చిత్రంలో అన్ని రకాల అంశాలు ఉంటాయని, కుటుంబ సమేతంగా ఈ చిత్రాన్ని వీక్షించ వచ్చని తెలిపారు. దర్శకుడు హర్షకు ఈ చిత్రం మొదటి చిత్రం అయినా కూడా ఒక సీనియర్ దర్శకుడి మాదిరిగా చిత్రాన్ని అద్భుతంగా తీశారని వివరించారు. ఈ చిత్రంలో హీరోయిన్ ఉండదని కేవలం నటీనటులు మాత్రమే ఉంటారని చెప్పారు. ఆగస్టు రెండున తమ చిత్రం విడుదల కానుందని, తెలుగు రాష్ట్రాల ప్రజలు తమ చిత్రాన్ని వీక్షించి విజయవంతం చేయాలని కోరారు. అనంతరం నటీమణులు అపర్ణాదేవి, కుషాలిని, చిత్ర నిర్మాత మహేంద్రనాథ్ కూండ్ల మాట్లాడుతూ చిన్న చిత్రాన్ని ఆదరించాలని వారు కోరారు.

త్యాగానికి ప్రతీక మొహర్రం

- పీరుల ఉత్సవాన్ని నిర్వహించిన ముస్లింలు
- కళకళలాడిన పంజా సెంటర్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకుని పంజా సెంటర్ బుధవారం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు భారీగా తరలివచ్చి పంజా సెంటర్‌లోని పీరుల చావడిని దర్శించుకున్నారు. స్థానిక లంకఫిర్ పంజా ఆధ్వర్యంలో మంగళవారం అర్ధరాత్రి పంజా సెంటర్‌లో అగ్నిగుండాలను ఏర్పాటు చేశారు. స్థానిక ప్రముఖులు, ప్రజాప్రతినిధులు సంప్రదాయబద్ధంగా ప్రార్థనలను నిర్వహించి వాటిని వెలిగించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు అగ్నిగుండంలో నడిచి తమ మొక్కులను తీర్చుకున్నారు. పండుగ సందర్భంగా నాలుగు రోజులు స్థానిక పంజాలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తారు. అందులో భాగంగా మంగళవారం రాత్రి పన్నెండు గంటల నుంచి తెల్లవారుజాము వరకూ భక్తుల కోలాహలం మధ్య పలు కార్యక్రమాలను నిర్వహించారు. డప్పుల హోరులో ముస్లింలు నిప్పుల్లో నడిచి తమ మొక్కులు తీర్చుకున్నారు. కులమతాలకు అతీతంగా ప్రజలు పంజాను దర్శించుకున్నారు. వించిపేటలోని షాహీ మసీదులో బుధవారం ప్రత్యేక నమాజ్ కార్యక్రమాలను నిర్వహించారు.





లంకపిర్ పంజాలో వేడుకలు : పంజా సెంటర్‌లో నిప్పల గుండాన్ని ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులు





కాళేశ్వరరావు మార్కెట్ సెంటర్‌లో పీరుల ఊరేగింపు : పంజా సెంటర్‌లో షర్బత్ పంపిణీ చేస్తున్న ముస్లింలు

మెయిన్ బజార్‌లో...

మెయిన్‌బజార్‌లోని అరికాటిక పీరుల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పీరుల చావడి వద్ద వేడుకలను నిర్వహించారు. మొహర్రం పండుగను పురస్కరించుకుని వారం రోజులుగా నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాలను బుధవారంతో ముగించారు. మంగళవారం రాత్రి ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. కాళేశ్వరరావు మార్కెట్ సెంటర్‌లో అగ్నిగుండాలను ఏర్పాటు చేసి నిప్పులపై భక్తులు నడిచి మొక్కులు తీర్చుకున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రధానం

కార్పొరేటర్ పుణ్యశీల

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): ప్రజలు తమ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని అప్పుడే అంటువ్యాధులకు దూరంగా ఉండవచ్చని 34వ డివిజన్ కార్పొరేటర్ బండి నాగేంద్ర పుణ్యశీల అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ అభియాన్‌లో భాగంగా బుధవారం డివిజన్‌లోని ఖుద్దూస్‌నగర్, కేదారేశ్వరపేటలో నగరపాలకసంస్థ సిబ్బందితో కలిసి 'పరిసరాలను శుభ్రంగా ఉంచుదాం-రోగాలను తరిమికొడదాం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పుణ్యశీల మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని, వ్యక్తిగత పరిశుభ్రత ద్వారా రోగాలకు దూరంగా ఉండవచ్చన్నారు. వర్షాకాలంలో సీజనల్‌గా వచ్చే మలేరియా, డెంగీ, కలరా, చికున్ గున్యా, డయేరియా వంటి వ్యాధుల నుంచి సురక్షితంగా ఉండాలంటే రోడ్లు, వీధులు, మురుగునీటిలో చెత్తను వేయకుండా ఉండాలన్నారు. ఈ వ్యాధులకు కారణమయ్యే దోమలను నివారించాలంటే ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిలవకుండా చూసుకోవాలని తెలిపారు. ఖాళీ ట్యాంకులు, టబ్బులు, కుండీలు, పాత టైర్లలో నీరు నిలువ లేకుండా చూసుకోవాలన్నారు. అనారోగ్య సమస్యలు తలెత్తితే దగ్గరలోని ప్రాథమిక కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించుకుని తగిన చికిత్సను పొందాలన్నారు. అనంతరం ప్రతి ఇంటికీ వెళ్లి కరపత్రాలను అందించారు. స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణ, ఏఎన్‌ఎంలు, మలేరియా సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

నేత్రాల విషయంలో అప్రమత్తంగా ఉండాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నేత్రాల విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానం కార్యనిర్వహణాధికారి మోహనరావు అన్నారు. అయాన్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో పాతబస్తీ బ్రాహ్మణవీధిలోని శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరాన్ని ప్రారంభించిన ఆలయ కార్యనిర్వహణాధికారి మోహనరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలన్నారు. సర్వేంద్రియానాం నయనం ప్రధానం అని, కళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శరీరానికి వ్యాయామం చాలా అవసరమన్నారు. ప్రతి రోజూ కొద్ది సేపు వ్యాయామానికి కొంత సమయాన్ని కేటాయించాలన్నారు. జీవన విధానంలో సరైన మార్పులు తీసుకుంటే చక్కని ఆరోగ్యాన్ని సొంతం చేసుకోగలరన్నారు. హాస్పిటల్స్ అధినేత డాక్టర్ బషీర్ అహ్మద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో ఆహారం, శారీరక శ్రమ తదితర అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. తద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకున్నవారవుతారని చెప్పారు. కార్యక్రమంలో హాస్పిటల్స్ గౌరవాధ్యక్షుడు వావిలాల రజనీకాంతశర్మ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్య పరిష్కరించండి సారూ..

భవానీపురం(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వై.సుజనా చౌదరి బుధవారం గట్టు వెనుక ప్రాంతంలోని 44వ డివిజన్‌లో పర్యటించారు. డివిజన్ పరిధిలోని కార్మిక శాఖ గ్రౌండ్‌లో జరుగుతున్న స్టేడియం నిర్మాణ పనులతో పాటు లేబర్‌కాలనీలోని పలు వీధులను ఆయన పరిశీలించారు. కాలనీలోని ఆరు డాబాల ప్రాంతంలో తిరిగి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ కచ్చా అవుట్ ఫాల్ డ్రెయిన్ నిత్యం పొంగి పొర్లుతోందని, ముఖ్యంగా వర్షం వస్తే చాలు డ్రెయిన్‌లోని మురుగునీరు ఇళ్లల్లోకి కూడా వచ్చేస్తుందని, వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు ఆయనను కోరారు. అనంతరం సుజనా చౌదరి మాట్లాడుతూ స్థానిక ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా స్టేడియం నిర్మాణం జరుగుతుందని చెప్పారు. డివిజన్‌లో సమస్యలు ఏమైనా ఉంటే ఎన్డీఏ నాయకుల దృష్టికి తీసుకువెళ్లాలని స్థానికులకు సూచించారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ సర్కిల్-1 జోనల్ కమిషనర్ కీర్తన, బీజేపీ నాయకుడు అడ్డూరి శ్రీరామ్, జనసేన నాయకులు తిరుపతి సురేష్, అనూష, మల్లెపు విజయలక్ష్మి, టీడీపీ నాయకులు అబ్దుల్ ఖాదర్, బొడ్డేపల్లి శ్రీను పాల్గొన్నారు.



లేబర్ కాలనీలో డ్రెయినేజీని పరిశీలిస్తున్న సుజనా చౌదరి

రైల్వే కార్మికుని కుటుంబానికి ఆర్థిక సాయం



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఈ ఏడాది మే 5న విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మృతిచెందిన రైల్వే కార్మికుని కుటుంబానికి రైల్వే మజ్దూర్ యూనియన్ ఆర్థిక సాయం అందజేసింది. ఈమేరకు దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్, విజయవాడ డివిజన్‌ల కార్యదర్శులు పి.రవీందర్, లీల బుధవారం మృతుని కుటుంబ సభ్యులకు రూ.1.50 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద కుటుంబంలో జన్మించి రైల్వే ఉద్యోగం పొందిన స్వల్పకాలంలోనే, చిన్న వయసులోనే మృత్యువాత పడటం అతని కుటుంబానికి ఎంతో శోకాన్ని మిగిల్చిందన్నారు. రైల్వేశాఖ తరఫున మృతుని కుటుంబానికి రావాల్సిన నష్టపరిహారం, ఉద్యోగం కోసం దక్షిణ మధ్య రైల్వే జీఎం, డీఆర్ఎంలను సంప్రదించి వారికి న్యాయం చేసేందుకు కృషిచేస్తామని ఈ సందర్భంగా వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు, సంపత్ కుమార్, వెంకట్, రాజేందర్,అంజి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఆఫీసర్స్ యూనియన్ నేత రవికుమార్‌కు సన్మానం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): బ్యాంక్ ఆఫీసర్ల సమస్యలను బ్యాంక్ యాజమాన్యాల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యేలా చూస్తానని ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ కాన్ఫెడరేషన్ (ఏఐబీవోసీ) సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కె.రవికుమార్ చెప్పారు. విజయవాడ గాయత్రీ నగర్‌లోని కెనరా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ (సీబీవోఏ) కార్యాలయం ఆవరణలో కె.రవికుమార్‌ను సీబీవోఏ ఆధ్వర్యంలో బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల మొదటి వారంలో గౌహతిలో జరిగిన ఏఐబీవోసీ సమావేశంలో ఈ ఎన్నిక ఏకగ్రీవంగా జరగడం చాలా సంతోషంగా ఉందన్నారు. తనకు వస్తున్న ఈ గుర్తింపు కేవలం కెనరా బ్యాంక్ మద్దతు వలనేనని రవికుమార్ చెప్పారు. కెనరా బ్యాంక్ విజయవాడ సర్కిల్ జీఎం పి.రవివర్మ ఏజీఎం ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ పది సంవత్సరాల క్రితం గుల్బర్గాలో ప్రొబేషనరీ ఆఫీసర్‌గా కెనరా బ్యాంక్‌లో ప్రయాణం మొదలు పెట్టిన రవికుమార్ కెనరా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా ఎన్నిక కావడమే కాకుండా ఏఐబీవోసీలో సీనియర్ వైస్‌ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం అభినందనీయమన్నారు. బ్యాంకింగ్ రంగంలో రవికుమార్ వేగంగా ఎదగడం ఆయన అంకితభావానికి, నాయకత్వ నైపుణ్యానికి నిదర్శనమని కొనియాడారు. కెనరా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ సభ్యులు పి.రామ్‌ప్రసాద్, జీవన్ సత్యప్రకాష్‌తో పాటుగా అధిక సంఖ్యలో బ్యాంక్ సిబ్బంది హాజరై రవికుమార్‌ను సత్కరించారు. తనను సత్కరించిన బ్యాంక్ ఉద్యోగులకు రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.




రవికుమార్‌ను సత్కరిస్తున్న బ్యాంకు ఉద్యోగులు

నేత్రపర్వంగా పాండురంగడి కల్యాణం

శాస్త్రోక్తంగా మూలమూర్తులకు తిరుమంజనం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం (కొత్తగుళ్ళు) ప్రాంగణంలో ఉన్న శ్రీ రుక్మాబాయి సమేత శ్రీ పాండురంగస్వామి వారి శాంతి కల్యాణోత్సవం బుధవారం నేత్రపర్వంగా జరిగింది. ఆలయంలో రెండు రోజుల నుంచి జరుగుతున్న కల్యాణ మహోత్సవాలలో భాగంగా బుధవారం తెల్లవారుజాము నుంచి పలు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయం స్వామి వారి మూలమూర్తులకు పంచామృత తిరుమంజనం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వివిధ ఫల, పుష్ప సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. ఆలయంలో కొలువై ఉన్న సంతాన వేణుగోపాలస్వామి వారికి కూడా తిరుమంజన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై స్వామి వారి తిరుకల్యాణోత్సవాన్ని నిర్వహించారు. తొలుత విష్వక్సేన పూజతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మహాసంకల్పం, యజ్ఞోపవీతధారణ, మధుపర్కాల సమర్పణ, మాంగల్యధారణ, తలంబ్రాలు సమర్పణ తదితర ఘట్టాలను ఆలయ అర్చకస్వాములు పులిపాక ఆంజనేయాచార్యులు, రాఘవాచార్యులు, అద్దేపల్లి మురళీకృష్ణాచార్యులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి కల్యాణోత్సవ విశిష్టతను అర్చకస్వాములు భక్తులకు వివరించారు. పండరీపురంలో జరిగే రీతిన నగరంలో కూడా స్వామి వారి కల్యాణోత్సవం, అర్చనలను నిర్వహించడం అపూర్వమని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు, కమిటీ సభ్యులు ఉభయ దాతలు పాల్గొన్నారు.





ప్రత్యేక అలంకారంలో పాండురంగడు : స్వామి వారి కల్యాణం

నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో వివిధ డిపార్ట్‌మెంట్లలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, చిన్న తరహా పరిశ్రమలను ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని భారత ఐక్య యువజన సమాఖ్య (యువైఎఫ్ఐ) రాష్ట్ర కన్వీనర్ కాసాని గణేష్ బాబు డిమాండ్ చేశారు. వించిపేటలోని సంఘ కార్యాలయంలో సంస్థ నగర కన్వీనర్ అనకాపల్లి కనకరాజు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగ అనుబంధ పరిశ్రమలు, పశువుల పెంపకం, పౌల్ట్రీ, డెయిరీ, చెరకు, చేపలు, రొయ్యల చెరువులు, పండ్ల తోటలు, పేపర్ మిల్లులలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): పున్నమి విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో 11 కేవీ శంకర మఠం విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా కొన్ని ప్రాంతాలలో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీవీ సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. గురువారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు జొన్నవిత్తులవారి వీధి, శంకర మఠం, పార్థసారథి వీధి, గురుకృప రోడ్, టీవీ కృష్ణారావు వీధి, గుప్తా సెంటర్ డౌన్, షాదీఖానా ఏరియా, అండిమాని బ్రహ్మయ్య వీధి, పోస్ట్ ఆఫీస్ రోడ్, బుద్ధావారి వీధి, కేసీ స్కూల్ రోడ్ అరవింద వీధి, సిమెంట్ రోడ్ తదితర ప్రదేశాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన వివరించారు.

దుర్గమ్మకు సారె సమర్పణ



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ మహిళా సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు ఆషాఢం సారెను సమర్పించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు కల్లూరి శ్రీవాణి ఆధ్వర్యంలో వివిధ జిల్లాల మహిళా సంఘాల కమిటీ ప్రతినిధులు సారె సమర్పణకు తరలివచ్చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్వబ్రాహ్మణ సంఘం గౌరవ అధ్యక్షుడు, కార్పొరేషన్ మాజీ చైర్మన్ తోలేటి శ్రీకాంత్, కార్తీక సాయి దంపతులు విచ్చేశారు. తొలుత మహా మండపం నుంచి ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్న అనంతరం ప్రధాన ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తికి సారెను సమర్పించారు. అమ్మవారి దయతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, అందరికీ చేతి వృత్తులు బాగుండాలని వేడుకున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మేడపి ప్రసాద్, తూమాటి రమేష్, మహేశ్వరి, శశికళ, చైతన్య, జయలక్ష్మి, సునీత, రత్నకుమారి పాల్గొన్నారు.